సాక్షి
ప్రకాశం

మంగళవారం । 15 । ఏప్రిల్ । 2025



సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి

ప్రతి ఒక్కరూ సమాజ శ్రేయస్సుకు పాటు పడాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. రెడ్డి హాస్టల్ ఆధుని కీకరణ పనులను ప్రారంభించారు.

- 8లో..



బియ్యం దందా..అడ్డుకట్టే లేదు

పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం కూటమి నేతలకు, రేషన్ వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది. అక్రమంగా బియ్యం తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
37/25

వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

బూచేపల్లిని కలిసిన ఇంటలెక్చువల్ వింగ్ నాయకులు



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు సిటీ: ఒంగోలులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలను వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ వింగ్ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇంటలెక్చువల్ వింగ్ నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొండా అంజి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అంగిరేకుల ఆదినారాయణ, వివిధ నియోజకవర్గాల అధ్యక్షులు బి.సత్యనారాయణ, డాక్టర్ వై.చిట్టిబాబు, కె.సుబ్బారావు, పరిమి వెంకటరావు, పొదిలి మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు వెంకటరావు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావుపై విచారణకు ఆదేశం

ఒంగోలు టౌన్: మార్కాపురం పూర్వ తహశీల్దార్, ప్రస్తుత డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాస రావు పై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. 2022లో ఆయన నాలుగు నెలల పాటు మార్కాపురం తహశీల్దార్‌గా విధులు నిర్వహించారు. తరువాత డిప్యూటీ కలెక్టర్ పదోన్నతిపై బదిలీ మీద వెళ్లిపోయారు. ఆ సమయంలో అసైన్‌మెంట్ భూమికి సంబంధించి ఒక రైతు ఆయనపై ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సిసోడియా విచారణకు ఆదేశించారు. డీఆర్‌ఓ చిన ఓబులేసును విచారణాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

హామీకి విరామం?

నడి సంద్రంలో ఆటుపోట్ల మధ్య..వలలు.. అలల మాటున పొట్టకూటి కోసం నిత్యం తిప్పలు తప్పని జీవితాలు.. బతుకు తీరం దాటేందుకు సుదూరం వెళ్లాల్సిందే. ఏ క్షణంలో ఏం ఉప్పెన ముంచుకొస్తుందో..అంతుపట్టని రోజుల తరబడి ప్రయాణం..వలలు భుజాన వేసుకుని, తిరిగి వస్తామో రామోనన్న నమ్మకం లేని పయనం..తరతరాలుగా గంగమ్మపై నమ్మకంతో బతుకుపోరు సాగిస్తూనే ఉన్నారు. కష్టాల సుడిగుండాల నడుమ బతుకు నావను ఈడుస్తున్న గంగపుత్రులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం మాటలతో కాలక్షేపం చేస్తోంది. నిషేధ కాలంలో ఇవ్వాల్సిన 'భరోసా'పై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఇప్పటికే ఒక సంవత్సరం ఎగనామం పెట్టిన కూటమి సర్కార్ ఈ ఏడాది అదిగో.. ఇదిగో అంటూ వాయిదాలు వేస్తూ వస్తోంది.

- సముద్రంలో చేపల వేట నిషేధం
- నేటి నుంచి 61 రోజులపాటు అమలు
- ఎన్నికల సమయంలో విరామ భృతి రూ.20 వేలు అంటూ హామీ
- గతేడాది భృతి ఎగ్గొట్టిన చంద్రబాబు ప్రభుత్వం
- రెండేళ్లుగా ఇవ్వాల్సిన భృతి రూ.21.18 కోట్లు



కొత్తపట్నం సముద్ర తీరం

రెండు సంవత్సరాలకు రూ.21.18 కోట్లు

జిల్లాలోని మత్స్యకారులకు మత్స్యకార భృతి రెండు సంవత్సరాలకు కలిపి మొత్తం రూ.21.18 కోట్లు రావాల్సి ఉంది. ఒక్కో మత్స్యకార కుటుంబానికి ఏడాదికి రూ.20 చొప్పున ఇస్తానని చంద్రబాబు చెప్పిన హామీ ప్రకారమే ఇవ్వాల్సి ఉంది. జిల్లాలో మొత్తం వేట సాగిస్తున్న మత్స్యకారులు 5,452 మంది అని లెక్కలు తేల్చారు. గత ఏడాది రావాల్సిన వేట విరామ భృతి రూ.10.90 కోట్లు కాగా ఈ ఏడాది కూడా వేట విరామం వచ్చేసింది కాబట్టి ఈ ఏడాదికి రావాల్సింది మరో రూ.10.90 కోట్లు కలుపుకుంటే రూ.21.18 కోట్లకు చేరింది.

ఒంగోలు సబర్బన్: సముద్రంలో చేపల వేట నిషేధానికి గంట మోగింది. సోమవారం అర్ధరాత్రి నుంచి 61 రోజులపాటు జూన్ 15 వరకు నిషేధం కొనసాగనుంది. రొయ్యలు, చేపలు గుడ్లు పెట్టి సంతానోత్పత్తి చేస్తాయి. ఇందుకు రెండు నెలల సమయం పడుతుంది. తద్వారా ఇవి మత్స్యకారుల ఉపాధికి దారి చూపుతాయి. ఈ కారణంతోనే ఏటా చేపల నిషేధం అమలులో ఉంటుంది. ఈ సమయంలో మర, ఇంజిన్ బోట్లు వేటకు దూరంగా ఉండాలి. కర్ర తెప్పలకు ఎలాంటి ఆంక్షలు ఉండవు. మత్స్యకారులు నిబంధనలు అతిక్రమించకుండా అధికార యంత్రాంగం పర్యవేక్షిస్తుంది. జిల్లాలోని నాగులుప్పలపాడు, ఒంగోలు, కొత్తపట్నం, టంగుటూరు, సింగరాయకొండ మండలాలు తీరప్రాంతంలో ఉన్నాయి. ఆయా మండలాల గ్రామాల మత్స్యకారులకు సముద్రపు వేట జీవనాధారం. జిల్లాలో సముద్రతీరం 55 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. తీరంలో 25 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. సుమారు 35 వేల మందికి పైగా జనాభా. 2024-25 సంవత్సరానికి సంబంధించి సంద్రంలో వేట సాగించే 5,452 మంది మత్స్యకారులు వేటనిషేధ భృతికి అర్హులని గుర్తించారు. వారికి రూ.5.45 కోట్ల భృతి చెల్లించాల్సి ఉంది. గతేడాది భృతే అందలేదు, ఈ ఏడాది కూడా అందుతుందో లేదోనన్న సంశయంలో మత్స్యకార కుటుంబాలు కొట్టుమిట్టాడుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వేట విరామం కింద ఒక్కో మత్స్యకార కుటుంబానికి ఏడాదికి రూ.10 వేల చొప్పున అందించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు వేట విరామ భృతి ఏడాదికి రూ.4 మాత్రమే ఇచ్చేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ మొత్తాన్ని పెంచి ఏడాదికి ఒక్కసారిగా రూ.6 వేలు పెంచి రూ.10 వేలు ఇస్తూ వచ్చారు. 2019వ సంవత్సరం నుంచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏడాదికి రూ.10 వేలు చొప్పున ఇస్తూ వచ్చింది. భృతితో పాటు వివిధ రాయితీలు, సంక్షేమ పథకాలు అందేవని, ఇప్పుడు మత్స్యకారుల సంక్షేమం గురించి పట్టించుకునేవారే కరువయ్యారంటూ మత్స్యకారులు వాపోతున్నారు.

ఎన్నికల సమయంలో రూ.20 ఇస్తానన్న చంద్రబాబు...

2024 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేతగా, ప్రతిపక్ష నేతగా మత్స్యకారులకు వరాల జల్లు కురిపించారు. ప్రధానంగా వేట విరామ భృతికి సంబంధించి ''జగన్ మోహన్ రెడ్డి ఏడాదికి రూ.10 వేలే ఇస్తున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వచ్చిన ఏడాది నుంచే భృతిని రూ.20 వేలు ఇస్తాను'' అంటూ హామీ ఇచ్చాడు. ఓట్లు దండుకున్నాక హామీని సంద్రంలో కలిపేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటుతోంది. గత సంవత్సరానికి చెందిన వేట విరామ భృతిని ఇప్పటి వరకు ఇవ్వలేదు. మళ్లీ ఈ ఏడాది వేట విరామం కూడా వచ్చేసింది. భృతికి సంబంధించి ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోవడంపై మత్స్యకారులు భగ్గుమంటున్నారు.

మోటరైజ్డ్ బోట్లు: 1089
కర్రతెప్పలు: 387
మత్స్యకార జనాభా: 35 వేల మంది
వేట సాగించేవారు: 5,452 మంది
చెల్లించాల్సిన భృతి (రూ.20 వేలు చొప్పున): రూ.10.90 కోట్లు

కూటమి ప్రభుత్వం పచ్చిమోసం చేసింది



వేట నిషేధ సమయంలో రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక మాట తప్పాయి. గత ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట చెప్పిన విధంగా ఏడాదికి రూ.10 వేలు భరోసా ఇచ్చారు. విరామ సమయంలో ఇవ్వడంతో రెండు నెలలు పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎంతో సంతోషంగా ఉన్నాం. కూటమి ప్రభుత్వం మమ్మల్ని మోసం చేసింది. తొలి ఏడాది భరోసా ఇవ్వలేదు. ఈ సారైనా ఇవ్వాలని కోరుకుంటున్నాను.

– రాసాని మీరాసాహెబ్, కె.పల్లెపాలెం, కొత్తపట్నం మండలం

నమ్మించి ఓట్లు దండుకుని..



మత్స్యకారులను నమ్మించి సీఎం చంద్రబాబు నాయుడు ఓట్లు వేయించుకుని మత్స్యకార భరోసాకు ఎగనామం పెట్టాడు. రూ.20 వేలు ఇస్తామని చెప్పి గత ఏడాది ఇవ్వలేదు. ఈ ఏడాది విరామ సమయం కూడా వచ్చేసింది. ప్రభుత్వానికి మత్స్యకారుల ఊసే పట్టడం లేదు. విరామ సమయంలో ఇస్తే మాకు అండగా ఉంటుంది. అసలు ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి.

– పెద్దసింగు శ్రీరాములు, గుండమాల, కొత్తపట్నం మండలం

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: సమాజంలో నిరుపేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు, బడుగుల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మాదాసి వెంకయ్య, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానంద రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న తదితరులు వైఎస్సార్ విగ్రహానికి, అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బీసీలు, ఎస్టీలు, ఎస్సీలు, మైనారిటీలు, అణగారిన వర్గాల ప్రజలందరూ తలెత్తుకుని తిరుగుతున్నారంటే అది అంబేడ్కర్ చేసిన కృషి అని అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తూ, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. మా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తామన్నారు.

ఒంగోలు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు మాట్లాడుతూ అంటరానితనం, సామాజిక వివక్షకు గురవుతున్న వర్గాలకు సమానవాటా కోసం, సామాజిక న్యాయం కోసం తన జీవితకాలం పోరాడిన దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. అంబేడ్కర్ ఆశయాలను స్మరించుకుంటూ ఆయన అడుగుజాడల్లో నడుద్దామని, రాజ్యాంగాన్ని సంరక్షించుకుందామన్నారు. రాష్ట్ర ప్రచారం విభాగం అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర రావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పేరం ప్రసన్న, బడుగు ఇందిర, ఎస్.రమణమ్మ, సాదం విజయలక్ష్మి, రొండా అంజిరెడ్డి, దామరాజు క్రాంతికుమార్, దాసరి కరుణాకర్, మహిళా నాయకురాలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ తల్లి తిరునాళ్ల



ప్రత్యేక పూజలు చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి



విద్యుత్ అలంకరణతో ముస్తాబైన దేవస్థానం

- ప్రత్యేక పూజలు చేసిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, వెంకాయమ్మ
- పలు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన గుంటి గంగమ్మ తల్లి తిరునాళ్ల సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పలు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. గంగమ్మకు పొంగళ్లు పెట్టుకుని, పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పక్కనే ఉన్న నాగదేవత పుట్ట శిలలను, పార్వతీ సమేత మల్లికార్జున స్వామివారిని దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారిని ఘనంగా సత్కరించారు. తిరునాళ్ల సందర్భంగా దేవస్థానాన్ని విద్యుత్ దీపాలతో అలకరించారు. స్థానిక ఎస్సై ఎస్.మల్లికార్జున రావు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా 250 మందిపైగా సిబ్బందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వివిధ దుకాణాలను అధిక సంఖ్యలో ఏర్పాటు చేశారు. సేవా సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం, చల్లని మజ్జిగ, మంచి నీళ్ల పంపిణీ చేశారు. 6 విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు.



నీటి గుండంలో శ్రీదేవి, భూదేవి సమేత నెమలిగుండ్ల రంగనాయకస్వామి తెప్పోత్సవం



స్వామివారి తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న వేలాది భక్తులు

నేత్రపర్వంగా రంగనాయకుని తెప్పోత్సవం

- తెప్పోత్సవం చూసేందుకు వచ్చిన వేలాది భక్తులు

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలిసిన నెమలిగుండ్ల రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాయకస్వామి తెప్పోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ పానకలరావు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య స్వామి వారిని పట్టు వస్త్రాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ సమీపంలోని నీటి గుండంలో ఏర్పాటు చేసిన తెప్పలో ఉత్సవమూర్తులను ఉంచి రంగనాయకా.. పాహిమాం..పాహిమాం అంటూ భక్తులు పులకించారు. స్వామివారి తెప్పోత్సవాన్ని చూసేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామి పల్లకి ఎదుట మహిళలు కోలాటాన్ని ప్రదర్శించారు. నీటి గుండం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తుగా గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్, రూరల్ సీఐ జె.రామకోటయ్య, కంభం సీఐ మల్లికార్జున్‌తో పాటు రాచర్ల, బేస్తవారిపేట, కొమరోలు, పొన్నలూరు, ఒంగోలు ఎస్సైలు పి.కోటేశ్వరరావు, రవీంద్రారెడ్డి, నాగరాజు, హనుక్, వెంకటేశ్వరనాయక్, సాంబశివరావుతో పాటు 40 మంది పోలీసు బలగాలను ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత నెమలిగుండ్ల రంగనాయకస్వామి దివ్య రథోత్సవం నిర్వహించారు.



స్వామి వారి పల్లకి వస్తున్న సమయంలో కోలాటం చేస్తున్న మహిళలు



రఘునాయకుని ఉత్సవమూర్తులకు తలంబ్రాలు పోస్తున్న అర్చకులు



హారతి అందుకుంటున్న భక్తులు

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- గరుడ పక్షి ప్రదక్షిణ అనంతరం స్వామి వారి కళ్యాణం

రమణీయం రఘునాయకుని కల్యాణం

నాగులుప్పలపాడు: భక్తుల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా నారాయణుడి ఆశీస్సులు మోసుకొచ్చి గరుడ పక్షి రాకతో చదలవాడ రఘునాయకుని కల్యాణోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. వారం రోజులుగా నిర్వహిస్తున్న చదలవాడ రఘునాయక స్వామి 240వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణాన్ని వేద పండితులు నిర్వహించారు. స్వామి వారి కల్యాణ ఘట్టంలో అత్యంత ముఖ్యమైనదిగా భావించే గరుడ పక్షి రాకకోసం ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఎదురు చూశారు. నారాయణ నామ స్మరణ మార్మోగుతున్న సమయంలో ఉదయం 11.30 గంటలకు గరుడ పక్షి కల్యాణ మండపంపై మూడు ప్రదక్షిణలు చేయడంతో రఘునాయకస్వామి కళ్యాణ ఘట్టాన్ని పండితులు పూర్తి చేశారు. ఈ కళ్యాణ వేడుకకు స్వామి వారికి ఆనవాయితీగా అందించే పట్టు వస్త్రాలను పెనుబోతు కుటుంబం స్వామి వారు సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం గ్రామంలో నిర్వహించిన రథోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





గరుడ పక్షిని చూసి నమస్కరిస్తున్న భక్తులు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన ఖాదర్‌వలి

గిద్దలూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని ముండ్లపాడు రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. వైఎస్సార్ జిల్లా కలసపాడు మండలం రామాపురానికి చెందిన ఖాదర్‌వలి(60) గిద్దలూరుకు వచ్చి పని ముగించుకుని తిరిగి స్వగ్రామం వెళుతున్న సమయంలో ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని మరో బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో ఖాదర్‌వలి తలకు తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

హత్యపై ముమ్మర విచారణ



మృతురాలి ఇంటివద్ద విచారణ చేస్తున్న సీఐ

పామూరు: స్థానిక ప్రశాంతి నగర్‌లో ఆదివారం యాసారపు మార్తమ్మను ఆమె భర్త యాసారపు రమేష్ హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సోమవారం సీఐ ఎం భీమానాయక్ విచారణ ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఘటన జరిగిన సమయంలో ఉన్న వారితో చర్చించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యానికి, మత్తు పదార్థాలకు బానిసలై క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో కుటుంబం, భార్యాబిడ్డలు ఛిన్నాభిన్నమవుతున్నారన్నారు. సీఐ వెంట వీఆర్‌ఓ శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రావెల్ ట్రాక్టర్లు స్వాధీనం




పట్టుబడిన గ్రావెల్ ట్రాక్టర్లు

గిద్దలూరు రూరల్: పట్టణంలో రైల్వేస్టేషన్ రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న మూడు గ్రావెల్ ట్రాక్టర్లను స్థానిక తహశీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి సోమవారం స్వాధీనం చేసుకున్నారు. అనధికారికంగా కొందరు వ్యక్తులు మండలంలోని కొండ శివారు ప్రాంతాల్లో అక్రమంగా మట్టి గ్రావెల్‌ను ట్రాక్టర్ల ద్వారా విక్రయించేందుకు వెళుతున్న సమయంలో తహశీల్దార్ అడ్డుకుని రెవెన్యూ కార్యాలయం ఆవరణకు ట్రాక్టర్లను తరలించారు. పట్టుబడిన ట్రాక్టర్లు ఎవరివి అనేది తెలియదని, వాటికి జరిమానాలు విధించి మట్టితోలకాల పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

కనిగిరిరూరల్: కూటమి ప్రభుత్వం పది నెలల పాలనలోనే అట్టర్ ఫెయిలైందని కాంగ్రెస్ నాయకుడు తులసీరెడ్డి అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిహంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అంటూ ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తరువాత వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. మెగా డీఎస్సీ పేరుతో 16 వేల టీచర్లకు ఉద్యోగాలు భర్తీ చేస్తామని తొలి సంతకం పెట్టి..10 నెలలు దాటినా ఇంత వరకు నోటిఫికేషన్ ఇవ్వలేదని, కనీస అవగాహనకు రాలేదని ఘాటుగా విమర్శించారు. యువతకు ఉద్యోగాలు వచ్చేంత వరకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి రాష్ట్రంలో 20 లక్షల మంది నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిందన్నారు. పార్టీ నాయకులు దేవరపల్లి సుబ్బారెడ్డి, వేల్పుల రాజశేఖర్, బలసాని కోటేశ్వరరావు, తాని గుండాల తిరుపతిరెడ్డి , సంగటి మల్లికార్జునరెడ్డి, పిల్లి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వంద ఎకరాల ప్రభుత్వ భూమి స్వాహా



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

కురిచేడు: మండలంలోని గంగదొనకొండ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 88లో వంద ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు స్వాహా చేసేందుకు సిద్ధమయ్యారు. సీబీజీ ప్లాంట్ ఏర్పాటుకు 800 ఎకరాలు కేటాయించిన విషయం విదితమే. అయితే దాని పక్కనే ఉన్న 100 ఎకరాల ఏడబ్ల్యూ భూమిని దున్నించి చదును చేశారు. దానిని విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కొందరు అధికార పార్టీ నాయకులు, మరికొందరు రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో ఆక్రమణకు తెరతీసినట్లు సమాచారం. కలెక్టర్ చొరవ తీసుకుని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని గంగదొనకొండ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



విద్యార్థులతో మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు వన్‌టౌన్: ప్రతి ఒక్కరూ సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. స్థానిక మామడిపాలెంలో ఆధునికీకరించిన రెడ్డి హాస్టల్‌లోని కొన్ని విభాగాలను బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి హాస్టల్ కమిటీ అధ్యక్షుడు కేవీ రమణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ తన భర్త సుబ్బారెడ్డి సంపాదించిన 10 రూపాయల్లో 9 రూపాయలు సమాజ సేవకే వెచ్చించేవారన్నారు. ఆయన బతికి ఉన్న సమయంలో రెడ్డి హాస్టల్‌ను సందర్శించిన సమయంలో హాస్టల్‌కు కొన్ని సౌకర్యాలు కల్పించాలని యోచించారన్నారు. ప్రస్తుతం తన భర్త చారిటబుల్ ట్రస్టు తరఫున వసతి గృహ విద్యార్థులకు సౌకర్యంగా ఉండేందుకు రూ.15 లక్షలు వెచ్చించి హాస్టల్‌ను ఆధునికీకరించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ హాస్టల్‌లో కిచెన్, డైనింగ్ రూం, సమావేశం గది, విద్యార్థులకు బెడ్లు, కొన్ని సివిల్ వర్క్సు నిర్వహించామన్నారు. విద్యార్థులు పేదరికాన్ని మరిచి మంచిగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థితికి చేరుకోవాలని కోరారు. మీరు గొప్పస్థాయికి వెళ్లిన తర్వాత మరికొంత మంది పేదలకు సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆదిరెడ్డి, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వైఎంప్రసాద్‌రెడ్డి, న్యాయవాది ఇనకొల్లు వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ కె.శీనారెడ్డి, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌ను సందర్శించిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

మామడిపాలెంలో ఆధునికీకరించిన రెడ్డి హాస్టల్‌ను వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భం విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు విద్యకు ప్రాధాన్యం ఇచ్చి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.

బియ్యం దందా.. అడ్డుకట్టే లేదు..!

- కొండపిలో నెలకు 13 వేల బస్తాల రేషన్ బియ్యం తరలింపు
- ప్రతి మండలానికి ఒకరిద్దరు చొప్పున బియ్యం సేకరణ
- నేరుగా సింగరాయకొండ రైస్ మిల్లుకు తరలింపు
- అధికారపార్టీ నాయకులు, అధికారులు నెలవారీ మామూళ్లు

సాక్షి టాస్క్ ఫోర్స్ :

పేదల కడుపులు నింపాల్సిన రేషన్ బియ్యం కూటమి నేతలకు, రేషన్ వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను పక్కన పెట్టిన రేషన్ దందాపై దృష్టి సారిచారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే ఏళ్ల తరబడి పేదలకు రేషన్ అందిస్తున్న డీలర్లతో బలవంతంగా రాజీనామాలు చేయించారు. వాటిని తమ వారికి అప్పగించారు. రాజీనామాలు చేయని డీలర్లపై అధికారులను ఉసికొల్పారు. కేసులు పెడతామంటూ బెదిరింపులకు దిగారు. రేషన్ వ్యాపారాన్ని తమ గుప్పిట్లోకి తెచ్చుకొని పెద్ద ఎత్తుమ అక్రమ వ్యాపారానికి తెరతీశారు. జిల్లాలోని 1392 దుకాణాలన్నీ ఇప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేల కనుసన్నల్లో నడుస్తున్నాయి. కొండపి నియోజకవర్గంలో అయితే రేషన్ దందా మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగుతోందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఒక కీలక నాయకుడి అండదండలతో రేషన్ మాఫియా రెచ్చి పోతుందని ప్రజలు చెప్పుకుంటున్నారు. నెలకు రూ.25 లక్షలు చెల్లించేలా ఒక ఒప్పందం చేసుకొని నియోజకవర్గంలోని మొత్తం రేషన్ వ్యాపారాన్ని సింగరాయకొండకు చెందిన ఒక రైస్ మిల్లు యజమానికి అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మండలానికి ఒకరిద్దరిని నియమించుకొని సేకరించిన బియ్యాన్ని నేరుగా సింగరాయకొండలోని ఒక రైస్ మిల్లుకు తరలిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిపోతున్నట్లు ప్రచారం సాగుతోంది.



బియ్యం సేకరణ ఇలా...

జరుగుమల్లి మండలంలో రేషన్ బియ్యాన్ని పైడిపాడు, కలమర్ల గ్రామాలకు చెందిన ఇద్దరు తెలుగు తమ్ముళ్లు సేకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని రేషన్ దుకాణాల డీలర్లు ఎవరైనా సరే వీరికి మాత్రమే బియ్యాన్ని విక్రయించాల్సి ఉంటుందని చెబుతున్నారు. పొన్నలూరు మండలంలో వెంకుపాలెం గ్రామానికి చెందిన ఒక ద్వితీయ శ్రేణి నాయకుడు బియ్యం సేకరిస్తున్నట్లు సమాచారం. టంగుటూరు మండలంలో సూరారెడ్డిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, కొండపి మండలంలో ఒంగోలు గద్దలగుంటకు చెందిన వ్యక్తితో పాటుగా కొండపి గ్రామానికి చెందిన మరో వ్యక్తి బియ్యం సేకరిస్తున్నట్లు సమాచారం. మర్రిపూడి మండలంలో కూడా ఒంగోలు గద్దలగుంట టీడీపీ నాయకుడు, ఒంగోలుకే చెందిన మరొక వ్యక్తి కలిసి సేకరిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇక సింగరాయకొండలో నేరుగా అసలు వ్యాపారే బియ్యం సేకరిస్తున్నట్లు తెలుస్తుంది.

ఎక్కడ నుంచి ఎంతెంత...?

నియోజకవర్గంలో నెలకు 13 వేల బస్తాలకు పైగా అక్రమంగా తరలిపోతున్నట్లు విశ్వసనీయ సమాచారం. పొన్నలూరు మండలం నుంచి నెలకు 2 వేల బస్తాలు, జరుగుమల్లి మండలం నుంచి 2,300 బస్తాలు, సింగరాయకొండ మండలం నుంచి 3,300 బస్తాలు, మర్రిపూడి మండలం నుంచి 2 వేల బస్తాలు, కొండపి మండలం నుంచి 2,400 బస్తాల బియ్యం, టంగుటూరు మండలం నుంచి 3 వేల బస్తాల బియ్యాన్ని సేకరించి సింగరాయకొండ రైస్ మిల్లుకు చేరవేస్తున్నట్లు సమాచారం.

గోడౌన్ కంప్యూటర్ ఆపరేటర్ కీ రోల్...

రేషన్ బియ్యంలో అరవై శాతానికి పైగా నేరుగా సివిల్ సప్లయ్ గోడౌన్ నుంచే రైస్ మిల్లుకు తరలిపోతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమ వ్యవహారంలో గోడౌన్ కంప్యూటర్ ఆపరేటర్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తుంది. సింగరాయకొండ సివిల్ సప్లయ్ గోడౌన్ నుంచి జరుగుమల్లి, పొన్నలూరు, కొండపిలోని 13 దుకాణాలు, టంగుటూరు, సింగరాయకొండ మండలాల రేషన్ దుకాణాలకు బియ్యం సప్లయ్ చేయాల్సి ఉంది. చీమకుర్తిలోని సివిల్ సప్లయ్ గోడౌన్ నుంచి కొండపిలోని కొన్ని దుకాణాలకు బియ్యం సప్లయ్ జరుగుతుందని సమాచారం. ఉండగా దీనిని అరికట్టాల్సిన అన్ని విభాగాల ప్రభుత్వాధికారులకు నెల మామూళ్లు పెద్ద ఎత్తున అందుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఈ దందాను వారు చూసీచూడన్నట్టు వదిలేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

బడుగుల కోసం అంబేడ్కర్ అవిశ్రాంత పోరు



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు వన్‌టౌన్: సమ సమాజ స్థాపన కోసం, బడుగుల అభ్యున్నతికి డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అవిశ్రాంతంగా పోరాడారని కలెక్టర్ తమీమ్ అన్సారియా కొనియాడారు. అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం సభ నిర్వహించారు. తొలుత కలెక్టరేట్ ఎదుట ఉన్న బాబా సాహెబ్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్‌తో పాటు దళిత సంఘాల నాయకులతో కలిసి ఆమె ఘన నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా అంబేడ్కర్ భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ పేద ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, హక్కుల సాధన కోసం అంబేడ్కర్ తన జీవితాంతం పోరాడారన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగాన్ని రచించిన ఘనత అంబేడ్కర్‌కే దక్కుతోందన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితోనే ప్రభుత్వ యంత్రాంగం పని చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీల్లో అక్షరాస్యత కొంత తక్కువగానే ఉందన్నారు. బడి వయసు ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్పించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నట్లు కలెక్టర్ అన్సారియా తెలిపారు. ఎమ్మెల్యే జనార్దన్ మాట్లాడుతూ అంబేడ్కర్ గొప్ప మేధావని, దార్శనికుడని కొనియాడారు. మరో ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ దళితులు ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడారు. అంబేడ్కర్ జీవిత చరిత్ర గురించి ప్రజా గాయకుడు నూకతోటి శరత్ రచించి గానం చేసిన ఆడియోను ఆవిష్కరించారు. డీఆర్‌ఓ చిన ఓబులేసు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఎన్. లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, హౌసింగ్ పీడీ పి.శ్రీనివాస ప్రసాద్, దళిత నాయకులు నీలం నాగేంద్రరావు, ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, చప్పిడి వెంగళరావు, బిళ్లా చెన్నయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ దార్శనికత దేశానికి వరం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: అంబేడ్కర్ దార్శనికతతో రాసిన రాజ్యాంగం వల్లే దేశం శాంతి, అభివృద్ధిని సాధిస్తూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని హెచ్‌సీఎం కళాశాల ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజ సంక్షేమం కోరిన ఆయన ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని దేశానికి అందించారని కొనియాడారు. దేశ ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్రాలతో, పరస్పర గౌరవంతో కలిసి మెలిసి జీవించాలని కోరుకున్నారని చెప్పారు. సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం, సామాన్య ప్రజల కోసం అహర్నిశలు పాటుపడ్డారని పేర్కొన్నారు. అంటరానితనాన్ని, వివక్షను నిర్మూలించేందుకు అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు. తొలుత జిల్లా పోలీసు కార్యాలయంలో కూడా డాక్టర్ అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, మహిళా పీఎస్ డీఎస్పీ వి. రమణ కుమార్, సీఐలు సుధాకర్, అజయ్‌కుమార్, జగదీష్ , పాండురంగారావు, ఆర్ఐలు సీతారామిరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

- 27 సవర్ల బంగారం, 2 కిలోల వెండి మాయం



బీరువాను పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు



నాసర్‌రెడ్డి

పొదిలి: స్థానిక విశ్వనాథపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సమీపంలోని ఓ గృహంలో సోమవారం పట్టపగలే భారీ చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట నాసర్‌రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. నాసర్‌రెడ్డి కరెంటు పనులకు వెళ్తుంటాడు. ఆదిలక్ష్మి రోజువారి కూలి పనులకు వెళ్తోంది. ఈ క్రమంలో రోజూలాగే ఎవరి పనులకు వారు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన నాసర్‌రెడ్డి తలుపు తీసి ఉండటం చూసి తొలుత భార్య వచ్చిందేమో అనుకున్నాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. చీరలు, ఇతర వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. చోరీ జరిగిందని గ్రహించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సుమారు 27 సవర్ల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి మాయమైనట్లు గుర్తించారు. చోరీ సొత్తు విలువ రూ.25 లక్షలు ఉంటుందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వేమన చోరీ జరిగిన గృహాన్ని సందర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాసర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వేమన తెలిపారు. పట్టపగలే చోరీ జరగటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రిపూట పోలీసుల గస్తీ ముమ్మరం చేయడంతో దొంగలు రూటు మార్చి పగలే చోరీకి పాల్పడ్డారని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పొరుగు జిల్లా దొంగలు చోరీకి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి గాయాలు



కాశీ (ఫైల్)

మార్కాపురం: ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి మార్కాపురం రైల్వేస్టేషన్ సమీపంలోని ఫ్లయిఓవర్ వద్ద జరిగింది. వివరాలు.. మండలంలోని నికరంపల్లి గ్రామానికి చెందిన ఈదా రామయ్య అచ్చమ్మల కుమారుడు కాశీ (23) అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేసుకుని శుక్రవారం గ్వాలియర్ నుంచి వచ్చాడు. ఆదివారం రాత్రి తన మిత్రులు బెంగళూరు నుంచి రైలుకు వస్తున్నారన్న సమాచారం రావడంతో వారిని కలిసేందుకు జేఆర్ కాలనీకి చెందిన గోగు చెన్నకేశవులును తన టూవీలర్‌పై ఎక్కించుకుని రైల్వేస్టేషన్‌కు బయల్దేరాడు. ఫ్లయిఓవర్ వద్దకు రాగానే టూ వీలర్ అదుపుతప్పి ఫుట్‌పాత్‌ను ఢీకొని కిందపడటంతో కాశీ తలకు తీవ్రగాయాలై మృతి చెందాడు. చెన్నకేశవులుకు గాయాలు కావడంతో జీజీహెచ్‌కు తరలించారు. వ్యవసాయాధికారిగా తన కుమారుడు రైతులకు సేవ చేస్తాడనుకుంటే ఇలా అర్థాంతరంగా ప్రాణాలు కోల్పోయాడని తల్లిదండ్రులు రామయ్య, అచ్చమ్మలు భోరున విలపించారు. రామయ్య రెండో కుమారుడు అయ్యప్ప గుంటూరులో 10వ తరగతి చదువుతుండగా కుమార్తె కాశీశ్వరికి వివాహం చేశారు. బేల్దారి మేస్త్రీగా చేస్తున్న రామయ్య తన కుమారుడిని మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్‌లో ఏజీ బీఎస్సీ చదివించాడు. మూడు రోజుల క్రితమే ఇంటికి వచ్చి ఇలా మృత్యుఒడిలోకి చేరాడని విలపించారు. చివరి దశలో తమను చూసుకుంటాడని ఆశిస్తే తామే తన కొడుకుకు అంత్యక్రియలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని రోదించారు.

భూ కబ్జాల వెనక పెద్దల హస్తం

- ముక్తినూతలపాడులో కబ్జాకు గురైన భూములు పరిశీలించిన వైఎస్సార్ సీపీ బృందం
- సిట్ వేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని ఎమ్మెల్యే దామచర్లకు హితవు
- కూటమి పాలనలో 9 నెలల్లోనే ప్రభుత్వ భూముల కబ్జాలు



కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఒంగోలు టౌన్: నగర పరిధిలోని రెండో డివిజన్ సర్వే నంబర్ 17లో 5.60 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వ్యక్తుల వెనక ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని వస్తున్న కథనాలపై ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్పందించాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ నాయకుల బృందం సోమవారం కబ్జాకు గురైన భూములు పరిశీలించారు. అనంతరం ముక్తినూతలపాడు గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కఠారి శంకర్ మాట్లాడుతూ సర్వే నంబర్ 17లో మొత్తం 21.17 ఎకరాల కుంట భూమి ఉందని మీ భూమి పోర్టల్ కూడా చూపిస్తుందని తెలిపారు. అయితే కూటమి పార్టీలకు చెందిన కొందరు వ్యక్తులు ఈ భూమిని కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. పట్టపగలే భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి ఆక్రమించుకున్నారని, ఈ విషయంపై పత్రికలలో వార్తలు వచ్చినా రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. సుమారు రూ.25 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటుంటే రెవెన్యూ అధికారులు ఏం పట్టనట్లు వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని చెప్పారు. ఈ కబ్జా వెనక పెద్దల హస్తం ఉండటం వల్లే రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. తక్షణమే రెవెన్యూ అధికారులు ఈ భూమిని స్వాధీనం చేసుకొని ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. నగర కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్‌ఖాన్ మాట్లాడుతూ గతంలో భూ కబ్జాలు జరిగాయని, సిట్ వేస్తామని గొప్పలు చెప్పిన పాలకులు ఇప్పుడీ కబ్జాలపై కూడా సిట్ వేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. గతంలో ఈ భూమిని పేదలకు పంపిణీ చేయాలని జాన్ ప్రకాశ్ కోర్టులో కేసు వేశారని, కోర్టులో ఉన్న భూమిని కబ్జా చేశారని చెప్పారు. 1929లో ఒక రిటైర్డ్ ఆర్మీ సైనికుడికి 5.60 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇచ్చినట్లు కబ్జాదారులు సోషల్‌మీడియాలో ప్రచారం చేస్తున్నారని, రెవెన్యూ అధికారులు మాత్రం ఇప్పటి వరకు సదరు భూమిని ఎవరికీ ఇవ్వలేదని చెబుతున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు వెంటనే భూమిని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూ కబ్జాలు ఎక్కువైపోయాయని, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఒంగోలు నియోజకవర్గంలో ఎక్కడైనా సరే ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కో ఆప్షన్ మెంబర్ శ్యాం సాగర్, నాయకులు దాసరి కరుణాకర్, నాగూర్, షాన్‌బాషా, మూసా, సీహెచ్ సత్యనారాయణరెడ్డి, కొక్కిలిగడ్డ వెంకటేశ్వర్లు, భువనేశ్వరి, పిగిలి శ్రీనివాసరావు, ఆనం శ్రీనివాసరెడ్డి, కాలేషా, ఎర్రజర్ల రమేష్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

మరో గ్రంథాలయ ఉద్యమానికి సన్నద్ధం

ఒంగోలు మెట్రో: మరో గ్రంథాలయ ఉద్యమాన్ని మే ఒకటో తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఒంగోలులో సోమవారం ఉదయం పది గంటలకు ఎన్జీవో హోం సమీపంలోని దీప్ ట్రస్ట్ భవనంలో గ్రంథాలయ ఉద్యమ సన్నాహక సమావేశం నిర్వహించారు. భాష, చదువులకు సంబంధించి, పిల్లలు, యువతకు సంబంధించిన అంశాలపై గ్రంథాలయ ఉద్యమాన్ని చేపడుతున్నామన్నారు. వివిధ సామాజిక సమస్యలపై ప్రచారం చేయాలని తీర్మానించారు. ఒంగోలు కేంద్రంగా నిస్వార్థంగా సామాజిక సేవ చేస్తున్న పలు సంస్థల అధిపతుల ఐక్య కార్యాచరణ కోసం ఐక్యవేదిక ఏర్పాటు విషయాన్ని చర్చిస్తారన్నారు. రంగభూమి కళాకారుల సంఘ అధ్యక్షుడు అంగలకుర్తి ప్రసాద్, బొమ్మరిల్లు వ్యవస్థాపకుడు కథా రచయిత పీ రాజ్యలక్ష్మి, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం, అధ్యక్షురాలు టీ అరుణ, మరో గ్రంథాలయ ఉద్యమ కార్యదర్శి కాంతి నల్లూరి, డాక్టర్ కొర్రపాటి సుధాకర్, ప్రముఖ విద్యావేత్త సీఏ ప్రసాద్, జానుడి డైరెక్టర్ ప్రముఖ రచయిత డాక్టర్ నూకతోటి రవికుమార్, దీప్ ట్రస్ట్ నిర్వాహకుడు సత్యనారాయణమూర్తి, దంత వైద్యులు డాక్టర్ శంకర్రావు, కవయిత్రి బీరం అరుణ పాల్గొన్నారు. గ్రంథాలయ ఉద్యమం ఒంగోలులో నిర్వహించి తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు స్ఫూర్తిగా నిలవాలని వక్తలు పిలుపునిచ్చారు.